
సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 25 । ఫిబ్రవరి । 2025



శివరాత్రికి ముమ్మర ఏర్పాట్లు

ఈనెల 26 నుంచి జరిగే శివరాత్రి వేడుకలకు అన్నపురెడ్డిపల్లి, ఇల్లెందులోని శివాలయాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. 8లో



... ఆదర్శంగా తీసుకోవాలి

గిరిజనులను చైతన్య పరిచిన సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే కనకయ్య అన్నారు. 8లో

వాతావరణం

గరిష్ఠం / కనిష్ఠం 36° / 20°

జిల్లాలో మంగళవారం ఉదయం ప్రారంభమైన ఎండ మధ్యాహ్నానికి తీవ్రం అవుతుంది. రాత్రికి చలి ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. ప్రతీ సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విష్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నేడు నెల్లూరులో రామయ్య కల్యాణం..

హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా ఏపీ రాష్ట్రం నెల్లూరులోని నెలకొర్తిపాడులో మంగళవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వార్లకు కల్యాణం నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ రమాదేవి తెలిపారు. ప్రచారం రథం ద్వారా ఉత్సవమూర్తులు, అర్చకులు, సిబ్బంది ఈ కార్యక్రమానికి బయలుదేరారని వెల్లడించారు.

మార్చి 31లోగా సర్వే పూర్తి చేయాలి



మాట్లాడుతున్న భాస్కర్‌నాయక్


కొత్తగూడెంఅర్బన్: మధుమేహం, రక్తపోటు, కేన్సర్ వంటి అసంక్రమిక వ్యాధులను కట్టడి చేయడమే జిల్లా వైద్యారోగ్య శాఖ లక్ష్యమని, ఈ మేరకు మార్చి 31నాటికి ఇంటింటి సర్వే పూర్తి చేసి 30 ఏళ్లు దాటిన వారందరికీ పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ భాస్కర్‌నాయక్ అన్నారు. జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యాధికారులు, సూపర్‌వైజర్లు, సిబ్బందితో సోమవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యాధి నిర్ధారణ అయిన వారికి దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఆయుష్మాన్ సెంటర్లు, యూపీహెచ్‌సీల్లో ఎక్కడైనా చికిత్స అందించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సమావేశంలో ఎన్‌సీడీ పీఓ డాక్టర్ మధువరన్, ఎన్‌సీడీడబ్ల్యూహెచ్ఓ కో ఆర్డినేటర్ శ్రీకాంత్, హరి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతలకు అభినందన



విజేతలకు కప్ అందిస్తున్న పరంధామరెడ్డి

కొత్తగూడెంటౌన్: వికారాబాద్‌లో ఈనెల 23న జరిగిన సబ్ జూనియర్స్ బాలికల కబడ్డీ ఫైనల్స్‌లో విజయం సాధించిన జిల్లా జట్టును డీవైఎస్ఓ పి.పరంధామరెడ్డి సోమవారం ఐడీఓసీలో అభినందించారు. జట్టు సభ్యులు కె.నీహారిక, కె.స్నేహప్రియ, కె.సమీర, బి.జమున, శ్రీవల్లి, సీహెచ్. పూజ, పద్మశ్రీ, కె.మౌనిక, అంజుశ్రీ, భవానీ, పి.ధనుశ్రీ, ఎం.హర్షిత డీవైఎస్ఓను ఐడీఓసీలో మర్యాదపూర్వకంగా కలిశారు.



● మోరంపల్లిబంజరలో ఎండిపోతున్న వరి పొలం

బోరుమంటున్నాయి !

బోరుబావుల్లో పడిపోతున్న భూగర్భ జలాలు

- యథేచ్ఛగా ఇసుక తవ్వకాలతో ఎండుతున్న వాగులు
- నెర్రెలు వారుతున్న వరి పొలాలు
- పలుచోట్ల పంటలను వదిలేస్తున్న రైతులు

గత పదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం భూగర్భ జలాలు పడిపోతున్నాయి. బోరు బావుల్లో నీటి లభ్యత నానాటికీ తగ్గిపోతోంది. కొన్ని ప్రాంతాల్లో అయితే ఇప్పటికే పూర్తిగా ఎండిపోయాయి. దీంతో రైతులు యాసంగిలో సాగు చేసిన పంటల భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. వరి పొలాలు నెర్రెలు వారి ఎండుతున్నాయి. కాగా, కొందరు రైతులు ఎండుతున్న పంటల్లో పశువులను మేపుతున్నారు. – బూర్గంపాడు

ఇసుక తవ్వకాలతో అడుగంటిన జలాలు..

జిల్లాలో గత సెప్టెంబర్ తర్వాత ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో వాగులు, వంకలు ఎండిపోయాయి. దీనికి తోడు వాగులు, నదుల్లో విచ్చలవిడిగా ఇసుకను తోడేశారు. తద్వారా భూగర్భ జలాలు పడిపోయాయి. ఇక ఈ ఏడాది ఫిబ్రవరి మొదటి వారం నుంచే ఎండల తీవ్రత పెరగగా.. పంటల సాగుకు నీటి వినియోగం ఎక్కువైంది. ఈ పరిస్థితులు భూగర్భ జలాలపై ప్రభావం చూపగా.. యాసంగి పంటలకు నష్టం వాటిల్లుతోంది. పొలాలను కాపాడుకునేందుకు రైతులు భగీరథ ప్రయత్నాలు చేస్తున్నా ఆశించిన మేర ఫలితం ఉండడం లేదు.

బోర్లు, బావుల ఆధారంగానే..

ఈ యాసంగిలో రైతులు జిల్లా వ్యాప్తంగా సుమారు 90 వేల ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. మరో 25వేల ఎకరాల్లో మొక్కజొన్న, 10 వేల ఎకరాల్లో అపరాలు, కూరగాయ పంటలు వేశారు. రైతులు బోరుబావులు, వాగులు, ఎత్తిపోతల పథకాలపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్నారు. అయితే ఫిబ్రవరిలోనే వాగులు ఎండిపోవడంతో బూర్గంపాడు, అశ్వాపురం, పినపాక, కరకగూడెం తదితర మండలాల్లో పంటలపై ఆశ చాలించుకుని వదిలేస్తున్నారు. ముఖ్యంగా వరి సాగుకు నీరు ఎక్కువగా అవసరం. రోజూ సరిపడా నీరందితేనే పంట చేతికందే అవకాశం ఉంటుంది. తడులు తగ్గితే దిగుబడి పడిపోతుంది. జిల్లాలో డిసెంబర్, జనవరి నెలల్లో వరి నాట్లు వేశారు. ఇప్పటివరకు రెండు, మూడు విడతల్లో ఎరువులు చల్లారు. కొన్ని చోట్ల పంట పొట్టదశకు, మరికొన్ని చోట్ల చిరు పొట్టదశకు చేరుకుంది. ఈ తరుణంలో నీటి అవసరం ఎక్కువ. అయితే ఎండల తీవ్రత, భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లలో నీరు లేక పంటలు ఎండిపోతున్నాయి. కొందరు రైతులు రూ.వేలల్లో ఖర్చు చేసి మరోచోట బోర్లు వేసి పైప్‌లైన్ల ద్వారా పొలాలకు నీరందించే ప్రయత్నాలు చేస్తున్నారు. అయితే కొత్తగా వేసిన బోర్లలో కూడా రెండు, మూడు గంటలకు మించి నీరందడం లేదు.



ఎండిన పంటలో పశువులను మేపుతున్న దృశ్యం

బోర్లలో నీరు రావడం లేదు



బోర్లలో నీళ్లు రావడం లేదు. రెండు గంటలు నడిస్తే ఐదు గంటలు మోటార్లు ఆపాల్సి వస్తోంది. కొన్ని బోర్లలో చుక్క నీరు కూడా రావడం లేదు. వరి చేతికందాలంటే మరో 40 రోజులు నీళ్లు ఎక్కువగా అవసరం. పొట్ట దశకు వచ్చిన వరి చేతికందుతుందో లేదో అనే ఆందోళన కలుగుతోంది. కొందరు రైతులైతే బోర్లలో నీరు లేక పంటలను పశువుల మేతకు వదిలేస్తున్నారు.

– ఆవుల వెంకటేశ్వరరెడ్డి, నాగినేనిప్రోలు

వాగులు ఎండిపోయాయి



జనవరిలోనే వాగులు ఎండిపోవడంతో బోర్లలో నీరు అడుగంటింది. వాగుల్లో ఎక్కడా చుక్కనీరు పారడం లేదు. నీరు లేక యాసంగి వరి పంట ఎండిపోతోంది. ఓ వైపు ఎండలు పెరగడం, మరోవైపు బోర్లు ఇంకిపోతుండడంతో యాసంగి వరి చేతికందే నమ్మకం లేదు.

– యదమకంటి రవీందర్‌రెడ్డి, రెడ్డిపాలెం

ప్రతీ దరఖాస్తును పరిశీలించాలి

ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వచ్చిన ప్రతీ దరఖాస్తును నిశితంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వారు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

వచ్చిన దరఖాస్తుల్లో కొన్ని..

- తాను 2008 డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించినా ఇప్పటివరకు ఎలాంటి ఉద్యోగావకాశం రాలేదని, తనకు ఎస్జీటీ కాంట్రాక్ట్ టీచర్ పోస్టు ఇప్పించాలని బూర్గంపాడు మండలం మోరంపల్లి బంజర గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు వినతిపత్రం ఇవ్వగా జిల్లా ఉపాధి కల్పనాధికారికి ఎండార్స్ చేశారు.
- టేకులపల్లి మండలం పెట్రాంచెలక గ్రామానికి చెందిన ఈసం కార్తీక్ తమ ఊర్లో గ్రంథాలయం నిర్మించేందుకు స్థానిక పెద్దలు తమ ఇంటి స్థలం అడిగారని, గ్రంథాలయం నిర్మించాక ఏదైనా పని కల్పిస్తామని చెప్పారని, అయితే రెండేళ్లు దాటినా గ్రంథాలయాన్ని ప్రారంభించలేదని ఫిర్యాదు చేశాడు. ఆ దరఖాస్తును గ్రంథాలయ చైర్మన్‌కు ఎండార్స్ చేశారు.



సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్లు

నాలుగుసార్లు దరఖాస్తు చేసినా..

ఇప్పటికి నాలుగుసార్లు ప్రజావాణిలో దరఖాస్తు చేసినా తమ సమస్య పరిష్కరించడం లేదని రామవరం ఏడో వార్డు వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ వీధిలో రెండువైపులా డ్రెయినేజీలు మంజూరు కాగా, ఒకవైపు నిర్మాణం పూర్తయిందని రెండో వైపు గోతులు తవ్వి వదిలేశారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గోదులతో వీధి వెడల్పు తగ్గిందని, అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్, ఫైరింజన్ వంటివి రావడానికి వీల్లేకుండా ఉందని తెలిపారు. రెండు నెలలుగా మున్సిపల్ కమిషనర్, డీఈ, టౌన్ ప్లానింగ్ అధికారులకు విన్నవించినా అటువైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. ఈ విషయమై ప్రజావాణిలో కూడా నాలుగుసార్లు దరఖాస్తు చేశామని చెప్పారు. కాగా, ఈ సమస్యపై సత్వరమే స్పందించి పరిష్కరించాలని మున్సిపల్ అధికారులను అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఆదేశించారు.

ట్రై సైకిల్ కోసం ఏడాదిగా తిరుగుతున్నా..



తనకు బ్యాటరీ ట్రైసైకిల్ ఇప్పించాలని ఏడాదిగా ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి దరఖాస్తు చేసుకుంటున్నా.. ఇప్పటికీ మంజూరు కాలేదని పాల్వంచ మండలం తోగ్గూడెం గ్రామానికి చెందిన దివ్యాంగ వృద్ధుడు జె.లక్కా ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అతడిని 'సాక్షి' పలకరించగా తన పరిస్థితిని వివరించాడు. గతంలో సైకిల్ మంజూరు చేశారని, దాన్ని చేతితో తిప్పుతూ వెళ్లే శక్తి ఇప్పుడు లేదని, బ్యాటరీ ట్రై సైకిల్ మంజూరు చేయాలని వేడుకుంటున్నా తనను ఎవరూ పట్టించుకోవడం లేదని చెప్పాడు. 80 శాతం అంగవైకల్యంతో బాధపడుతున్న తనకు ఇప్పటికైనా బ్యాటరీ ట్రైసైకిల్ మంజూరు చేయాలని అధికారులను వేడుకుంటున్నాడు.

'సీతారామ'ను సందర్శించిన తుమ్మల

ములకలపల్లి: మండల పరిధిలోని వీకే రామవరంలో నిర్మించిన సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్ -2ను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం సందర్శించారు. కొత్తగూడెం వెళుతున్న ఆయన.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎలాంటి హడావిడి లేకుండా పంప్‌హౌస్‌లోని డిశ్చార్జ్ పాయింట్, కెనాళ్లను పరిశీలించారు.

శివాలయంలో పూజలు..

దమ్మపేట : మండల పరిధిలోని ముష్టిబండ శివారులో వేంచేసి ఉన్న శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వారి ఆలయాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శివయ్య కరుణాకటాక్షాలతో తెలంగాణ ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రావు గంగాధర్ రావు, నాయకులు ఎర్రా వసంతరావు, చందా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



పంప్‌హౌస్ వద్ద డిశ్చార్జ్ పాయింట్‌ను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

అభ్యసన సామర్థ్యాల పెంపునకు ఏఐ

- విద్యార్థులకు కంప్యూటర్ విద్య తప్పనిసరి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

భద్రాచలం/బూర్గంపాడు: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు కంప్యూటర్ కోర్సులు తప్పనిసరని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. పిల్లల్లో అభ్యసన సామర్థ్యాల పెంపుదలకు కృత్రిమ మేథ (ఏఐ) ఉపయోగపడుతుందని చెప్పారు. కృత్రిమ మేథ ఆధారిత సామర్థ్యాల పెంపుదల కార్యక్రమాన్ని భద్రాచలం, బూర్గంపాడు మండలం అంజనాపురం, మోరంపల్లిబంజర, బూర్గంపాడు, నాగినేనిప్రోలు, సారపాక ప్రాథమిక పాఠశాలల్లో సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రాథమిక స్థాయిలోనే కంప్యూటర్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. కృత్రిమ మేథతో పిల్లల్లో అభ్యసన సామర్థ్యాల సాధన సులభం అవుతుందన్నారు. ఇంటి వద్ద కూడా చదువుకునే వాతావరణం కల్పిస్తే అద్భుత ఫలితాలు సాధిస్తారన్నారు. ఆయా కార్యక్రమాల్లో డీఈఓ వెంకటేశ్వరాచారి, అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, బూర్గంపాడు ఎంఈఓ యదుసింహరాజు, తహసీల్దార్ ముజాహిద్, ఎంపీడీఓ జమలారెడ్డి పాల్గొన్నారు.

48 గంటలు సైలెన్స్ పీరియడ్..

సూపర్‌బజార్(కొత్తగూడెం): నల్లగొండ – ఖమ్మం – వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఈనెల 27న పోలింగ్ నేపథ్యంలో ఈ 48 గంటలు సైలెన్స్ పీరియడ్ అమల్లో ఉంటుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి గురువారం సాయంత్రం 4 వరకు బహిరంగ సభలు, ఊరేగింపులు, సమావేశాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఎలాంటి అభ్యంతరకర, రాజకీయ అంశాలతో కూడిన మెసేజ్‌లు పంపడంపై ఈసీ నిషేధం విధించిందని పేర్కొన్నారు. సోషల్ మీడియాలో వచ్చే మెసేజ్‌లను నిశితంగా పరిశీలిస్తామని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 48 గంటల సైలెన్స్ పీరియడ్‌లో స్థానికేతరులు ఎవరూ జిల్లాలో ఉండరాదని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసే వరకు ఆయా జిల్లాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపారు.

దుమ్ముగూడెం ఆనకట్ట పరిశీలన..

అశ్వాపురం: మండలంలోని కుమ్మరిగూడెం వద్ద గల దుమ్ముగూడెం ఆనకట్టను కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం సందర్శించారు. ఆనకట్ట వద్ద గోదావరి నీటిమట్టం తగ్గి ప్రస్తుతం 49.1 మీటర్లు ఉండడంతో అధికారులతో మాట్లాడి ఎస్ఎస్‌పీ కెనాల్ కు సీతారామ ద్వారా నీరు అందించే విషయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతాయా అని ఆరా తీశారు. ప్రస్తుత నీటి మట్టంతో నీరు వదలడం ఇబ్బందేనని, తుపాలకుగూడెం సమ్మక్క బ్యారేజీ నుంచి నీరు వదిలారని, ఆ నీరు వచ్చేందుకు రెండు రోజులు పడుతుందని, ఆ తర్వాత సమస్య ఉండదని అధికారులు వివరించారు. అనంతరం ప్రధాన కాలువ జీరో పాయింట్ వద్ద కెనాల్‌కు, గోదావరి కి మధ్య అడ్డుకట్ట తొలగించే పనులను కలెక్టర్ పరిశీలించారు. ఎన్‌జీటీలో కేసు పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్‌జీటీలో క్లియరెన్స్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం బీజీకొత్తూరులోని సీతారామ ప్రాజెక్ట్ ఫేజ్–1 పంప్‌హౌస్‌ను పరిశీలించి నీటిపారుదల శాఖ అధికారులతో సమీక్షించారు. కార్యక్రమంలో ఎస్ఈలు శ్రీనివాస రెడ్డి, రవికుమార్, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాస్, ఏఈ రమేష్ పాల్గొన్నారు.



మోరంపల్లి బంజర పాఠశాలలో అభ్యసన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ పాటిల్

రైల్వే ట్రాక్ పనుల్లో వేగం పెంచండి

మణుగూరు టౌన్ : బీటీపీఎస్ బొగ్గు రవాణా కోసం జరుగుతున్న రైల్వే ట్రాక్ పనులు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం బీటీపీఎస్‌ను సందర్శించిన ఆయన రైల్వే ట్రాక్ పనుల వేగానికి అడ్డంకిగా ఉన్న భూ సేకరణను త్వరగా చేపట్టాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. బీటీపీఎస్‌లో బూడిద టన్ను రూపాయికి ఇస్తుండగా సద్వినియోగం చేసుకునేలా వినియోగదారులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం సీఈ బిచ్చన్న, ఎస్ఈ, తహసీల్దార్ రాఘవరెడ్డితో కలిసి ఆయన ఇందన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియాతో వీసీలో మాట్లాడారు.

ఈ–ఫైలింగ్‌తో ఎంతో మేలు

జిల్లా జడ్జి పాటిల్ వసంత్

కొత్తగూడెంటౌన్: ఈ – ఫైలింగ్ విధానం ఎంతో మేలని, కేసుల నమోదు వంటి వాటిని డిజిటల్ రూపంలోకి మార్చేందుకు ఈ ప్రక్రియ దోహదం చేస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. జిల్లా కోర్టు హాల్‌లో ఈ ఫైలింగ్ విధానంపై సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఫైలింగ్ విధానంపై అందరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. రాష్ట్ర స్థాయి శిక్షకులు ముప్పు రవీంద్రారెడ్డి, సాముల రోహిత్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఫైలింగ్ ద్వారా కేసుల దాఖలు చేయడంపై వివరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి, న్యాయమూర్తులు బత్తుల రామారావు, ఎ.సుచరిత, కె.సాయిశ్రీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఉపాధ్యక్షులు తోట మల్లేశ్వరావు, ప్రధాన కార్యదర్శి ఎం.ఎస్.ఆర్ రవిచంద్ర, సాధిక్‌పాషా, ప్రవీణ్‌కుమార్, దూదిపాల రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



న్యాయమూర్తులు, లాయర్లతో జడ్జి పాటిల్ వసంత్

ఎర్రబంగారం కళకళ !



మిర్చి బస్తాలతో నిండిపోయిన మార్కెట్ ఆవరణ

ఖమ్మం మార్కెట్‌కు 1.20 లక్షల మిర్చి బస్తాలు

పంట కోతలు జోరందుకోవడంతో పెరిగిన విక్రయాలు

ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్ సోమవారం మిర్చి బస్తాలతో కళకళలాడింది. మార్కెట్‌కు దాదాపు 1.20 లక్షల మిర్చి బస్తాలను రైతులు విక్రయానికి తీసుకొచ్చినట్లు అధికారులు వెల్లడించారు. శని, ఆదివారం మార్కెట్ సెలవు కావడంతో ఆదివారం రాత్రి నుంచే వాహనాల్లో మిర్చి బస్తాలను తీసుకురాగా యార్డు నిండిపోయింది. దీంతో పత్తి యార్డును కూడా మిర్చి క్రయవిక్రయాలకు కేటాయించారు. మిర్చి కోతలు ముమ్మరంగా సాగుతుండడంతో విక్రయాలు పెరిగినట్లు భావిస్తున్నారు. కాగా, పంట కొనుగోళ్లు, కాంటాలు, తోలకాల్లో ఆలస్యం జరగకుండా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

రెండో కోత కావడంతో..

మిర్చిని మూడు కోతలుగా విభజిస్తారు. ఇందులో మొదటి కోతలో ఎక్కువగా మైల కాయ రాగా, రెండో కోత వచ్చే కాయలు నాణ్యతగా ఉంటాయి. ప్రస్తుతం రెండో కోత సాగుతున్న నేపథ్యాన అధికంగా విక్రయానికి తీసుకొస్తున్నారు. 'తేజా' రకం కొనుగోళ్లలో ఖమ్మం మార్కెట్‌కు పేరు ఉండడంతో ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ నుంచే కాక మహబూబాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు ఏపీలోని ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల రైతులు సైతం మిర్చి తీసుకొచ్చారు.

ధరతో దిగాలు..

ఊహకందని విధంగా ఈ ఏడాది మిర్చి ధర పతనం కావటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. గత ఏడాది క్వింటాకు రూ.23 వేల మేర ధర పలకగా ఈ ఏడాది రూ.13వేలకు పడిపోయింది. సోమవారం ఖమ్మం మార్కెట్‌లో జెండాపాట ధర రూ.14,125గా, మోడల్ ధర రూ.13,600గా, కనిష్ట ధర రూ.6వేలుగా నమోదైంది. తాలు మిర్చి గరిష్ఠంగా రూ.6,500,, మోడల్ ధర రూ.6వేలు, కనిష్ట ధర రూ. 5,200గా పలికింది.

క్లుప్తంగా

5 నుంచి పగిడిద్దరాజు జాతర


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అరెం వంశీయులు

గుండాల: గిరిజనుల వన దేవత మేడారం సమ్మక్క భర్త, అరెం వంశీయుడు పగిడిద్ద రాజు జాతర మండలంలోని యాపలగడ్డ గ్రామంలో మార్చి 5,6,7 తేదీల్లో నిర్వహించనున్నట్లు మేడారం ట్రస్టు బోర్డు చైర్మన్ లచ్చూ పటేల్ తెలిపారు. సోమవారం యాపలగడ్డ సమ్మక్క–పగిడిద్దరాజు గద్దెల వద్ద జాతర పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. మూడు రోజులపాటు జాతర సాగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమ్మక్క–సారలమ్మ ప్రధాన పూజారి సిద్దబోయిన స్వామి, తాడ్వాయి మాజీ సర్పంచ్ ఇర్స సునీల్, అరెం లక్ష్మినర్సు, అరెం కాంతారావు, సమ్మయ్య, బసవయ్య, నాగయ్య, చిన్న కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో ఆశ్రమ విద్యార్థుల సత్తా


పతకాలతో ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు

ఇల్లెందురూరల్: కొత్తగూడెంలో గత ఆదివారం జరిగిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఇన్విటేషన్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో రొంపేడు బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థినులు సత్తా చాటారు. ఏడుగురు విద్యార్థినులు బంగారు పతకాలు సాధించారు. ఎనిమిదో తరగతి విద్యార్థినులు బి.అనూష, బి.అంజలి, బి.మౌనిష, అక్షిత, చైత్రిక, వెన్నెల, మనుశ్రీ బంగారు పతకాలు, 9వ తరగతి విద్యార్థిని బి.రిషిత, ఏడో తరగతి విద్యార్థినులు జె.స్రవంతి వెండి పతకాలు గెలుచుకున్నారు. విద్యార్థినులను హెచ్ఎం భూక్య పద్మ, వార్డెన్ బానోత్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, కరాటే శిక్షకుడు భూక్య శ్రీను సోమవారం అభినందించారు.

నేటి బాలలదే రేపటి సమాజం


విజేతలకు బహుమతులు అందజేస్తున్న బిషప్ ప్రకాశ్

తల్లాడ: నేటి బాలలే రేపటి పౌరులని, వారిపైనే సమాజ భవిష్యత్ ఆధారపడి ఉందని ఖమ్మం మేత్రాసనం పీఠాధిపతి సగిలి ప్రకాశ్ అన్నారు. తల్లాడ మండలం రెడ్డిగూడెం క్రీస్తు జ్యోతి కళాశాలలో సోమవారం 17 పాఠశాలల విద్యార్థులకు నృత్య పోటీలు నిర్వహించగా విజేతలకు ఆయన బహుమతులు అందజేసి మాట్లాడారు. విద్యార్థులు సరైన లక్ష్యాలను ఎంచుకుని వాటి సాధనకు కృషి చేయకపోతే భవిషత్‌లో సమస్యలు ఎదురవుతాయన్నారు. ఈమేరకు బాధ్యత కలిగిన పౌరులుగా క్రమశిక్షణ పాటిస్తూ ఎదగాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ థామస్, జ్యోన్సీస్, ప్రదీప్‌రెడ్డి, శ్రీకాంత్, రాజేష్, రవి, జోసఫ్, జస్టిన్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సీజ్


వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

పాల్వంచ: బైక్‌పై తరలిస్తున్న నిషేధిత గంజాయిని సోమవారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. టీం సీఐ సుంకరి రమేష్ కథనం ప్రకారం.. ఆంధ్రా, ఒడిశా సరిహద్దు నుంచి హైదరాబాద్‌కు ఐదు కేజీల ఎండు గంజాయి బైక్‌పై ఇద్దరు వ్యక్తులు తరలిస్తుండగా పాల్వంచ నవభారత్ వద్ద పట్టుకున్నారు. బైక్‌ను స్వాధీనం చేసుకుని, నిందితులు మర్రి సాయితేజ, కట్ల వివేక్ రెడ్డిలపై కేసు నమోదు చేశారు. సిబ్బంది కరీం, సుధీర్, వెంకటేష్, విజయ్, హనుమంతరావు, ఉపేందర్ పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు మృతి

తల్లాడ: మండలంలోని రెడ్డిగూడెం క్రాస్ వద్ద సోమవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన మూకర ఎర్రయ్య(76) ఆదివారం రాత్రి రెడ్డిగూడెంలోని బంధువుల ఇంటికి వెళ్లి సోమవారం తెల్లవారుజామున కాలినడకన తిరిగి వస్తున్నాడు. ఈక్రమంలో జాతీయ రహదారిపై అతి వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఆయనను ఢీకొట్టగా తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈమేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ జేవీయర్ తెలిపారు.

శివరాత్రికి ముమ్మర ఏర్పాట్లు

- ముస్తాబవుతున్న అన్నపురెడ్డిపల్లిలోని హరిహర క్షేత్రం
- ఉత్సవాలకు తరలిరానున్న వేలాది మంది భక్తులు



ఆలయ ప్రాంగణంలో ఉన్న శివపార్వతుల విగ్రహాలు, (ఇన్‌సెట్)ఉత్సవాలకు ముస్తాబైన శివాలయం

అన్నపురెడ్డిపల్లి (చంద్రుగొండ): అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. హరిహరక్షేత్రం భక్తుల పాలిట కొంగుబంగారంగా, మృత్యుంజయ ఆలయంగా భాసిల్లుతోంది. శివరాత్రి సందర్భంగా ఈ నెల 25 నుంచి 27వ తేది వరకు ఉత్సవాల నిర్వహణకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, చాందిని వస్త్రాలతోపాటు విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. అన్నపురెడ్డిపల్లి గ్రామానికి చెందిన మారగాని శ్రీనివాసరావు 2006లో రూ.2.5 కోట్లతో ఆలయాన్ని పునర్నిర్మించారు. కాటేజీ, భారీ నందీశ్వరుడు, దక్షిణమూర్తి, మృత్యుంజయుడు, శివపార్వతులు, భక్తకన్నప్ప, ఆంజనేయస్వామి విగ్రహాలతోపాటు భారీగా ఉన్న ధ్వజస్తంభం ఏర్పాటు చేశారు. శివరాత్రి సందర్భంగా ప్రతి ఏటా వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులకు తరలివచ్చి స్వామివారి దర్శనం చేసుకుంటారు.

శివసంకల్పంతోనే...

శివసంకల్పంతోనే ఆలయ అభివృద్ధికి నా వంతు కృషి చేశాను. అన్నపురెడ్డిపల్లి గ్రామాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని ప్రభుత్వానికి అనేకమార్లు నివేదించాం. దేవాదాయశాఖ పరిధిలో ఉన్నప్పటికీ శివాలయం అభివృద్ధికి మరింత కృషిచేస్తా.

–మారగాని శ్రీనివాసరావు, విద్యావేత్త

అన్ని ఏరాట్లు చేశాం

శివరాత్రి ఉత్సవాలకు భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. వైద్యశిబిరం, తాత్కాలిక వసతి, తాగనీటి సదుపాయాలు కల్పించాం. సత్తుపల్లి, కొత్తగూడెం నుంచి ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సులు కూడా ఏర్పాటు చేసింది.

–పాకాల వెంకటరమణ, ఆలయ ఇన్‌చార్జి మేనేజర్

కాశీ విశ్వేశ్వరుడి కల్యాణానికి..


85 ఏళ్ల క్రితం ప్రతిష్ఠించిన శివలింగం

ఇల్లెందు: పట్టణంలోని మెయిన్ రోడ్‌లో ఉన్న శివాలయం శివరాత్రి ఉత్తవాలకు ముస్తాబవుతోంది. ఈ నెల 26న జగదాంబా సమేత కాశీ విశ్వేశ్వర కల్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. సత్తులాల్ దమ్మిలాల్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో 1940లో కాశీ నుంచి శివలింగం తెచ్చి ఇక్కడ ప్రతిష్ఠించారు. ఆ తర్వాత శ్రీ జగదాంబా అమ్మవారి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆంజనేయస్వామి, కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాలను నిర్మించారు. 85 ఏళ్లుగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మహాశివరాత్రి పర్వదినం రోజు మేళతాళాలు, మంగళవాయిద్యాలతో కాశీ విశ్వేశ్వరుడి కల్యాణం జరిపించటం ఆనవాయితీగా వస్తోంది. సత్తులాల్ దమ్మిలాల్ వారసులు (అనువంశిక ధర్మకర్తలు)గా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అర్చకుడు నాగభూషణం, ధర్మకర్తలు నరేష్‌కుమార్, నీరజ్‌కుమార్, ఆనంద్‌కుమార్, రాజు పండిట్ తెలిపారు.

ఆత్మలింగేశ్వరాలయంలో...


ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఉత్సవాల నిర్వాహకులు

పాల్వంచ: పట్టణంలోని శ్రీఆత్మలింగేశ్వరాలయంలో మహాశివరాత్రికి ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. 25న రుద్రాభిషేకం, 26న కాశీ నుంచి తెప్పించిన శివలింగాలకు అభిషేకాలు, సాయంత్రం శివలీలా కల్యాణ మహోత్సవం, 27న అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. ఆలయ ధర్మకర్త మచ్చా శ్రీనివాసరావు, నిర్వాహకులు వల్లపు యాకయ్య, నిమ్మగడ్డ రమణ, అచ్చుత్‌రావు, రేఖ అప్పారావు, కృష్ణ, వీరయ్య చౌదరి, కర్నాటి నారాయణ, బొర్రా జయమ్మ తదితరులు పాల్గొన్నారు. బొల్లేరుగూడెంలోని శ్రీ లలిత కామేశ్వర స్వామి ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆహ్వాన పత్రికలను రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త శివలెంక అశ్వినికుమార్, సమ్మిడి జనార్దన్ రెడ్డి, ముడిక శ్రీనివాసరావు, అరుణ్‌స్వామి, వెంకన్న, రాము, శాంతి వర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన గిరిజనులందరికీ సంక్షేమ పథకాలు

'దర్బార్'లో ఐటీడీఏ పీఓ రాహుల్


దరఖాస్తుదారుల సమస్యలు తెలుసుకుంటున్న పీఓ రాహుల్

భద్రాచలం: అర్హులైన ప్రతీ గిరిజనుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు చొరవ చూపాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలోని ఐటీడీఏ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో పాల్గొన్న ఆయన వివిధ గ్రామాల గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరించి అర్హతల మేరకు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ దరఖాస్తుల వెంట తగిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని, తద్వారా త్వరగా పరిష్కారానికి వీలవుతుందని తెలిపారు. కాగా, అశ్వారావుపేట, పినపాక మండల వాసులు విద్యుత్ బోర్లు, ఇల్లెందు మండలానికి చెందిన పలువురు ఆర్వోఎఫ్ఆర్ పట్టాల కోసం, దమ్మపేట మండలం రెడ్డియాలపాడుకు శ్రీవిద్య ఉన్నత చదువుకు ఆర్థిక సాయం అందించాలని, అశ్వాపురం మండలంలోని పలు గ్రామాల గిరిజనులు పంట పొలాల్లో సోలార్ ప్లాంట్లు మంజూరు చేయాలని దరఖాస్తులు అందించారు. ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, వివిధ శాఖల అధికారులు నాగార్జునరావు, రవీంద్రనాథ్, చంద్రశేఖర్, సున్నం రాంబాబు, భాస్కర్, ఉదయ్‌కుమార్, మణిధర్, నారాయణరావు, లక్ష్మీనారాయణ, వేణు, ఆదినారాయణ, హరికృష్ణ, లింగానాయక్ పాల్గొన్నారు. కాగా, కూసుమంచి మండలం గోరీలపాడు తండాకు చెందిన తేజావత్ సింధు భద్రాచలంలోని గురుకుల కళాశాలలో ఇంటర్ పూర్తిచేసి ఐఐటీలో సీటు సాధించగా ప్రోత్సాహకంగా రూ.50 వేల చెక్కును ఆమె తల్లిదండ్రులకు పీఓ అందజేశారు.

సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే కనకయ్య తదితరులు

ఇల్లెందు: లంబాడాలను చైతన్య పరిచిన సంత్‌శ్రీ సేవాలాల్ మహరాజ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యే కోరం కనకయ్య సూచించారు. సోమవారం సేవాలాల్ జయంతి వేడుకల ముగింపు సందర్భంగా ర్యాలీ, సభ నిర్వహించారు. పట్టణంలోని జేకే సింగరేణి హైస్కూల్ గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎంపీ, ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి బోగ్ బండారో, వింతీ కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అహింసామార్గం ఆచరణీయమని, దాని ద్వారా మాత్రమే గిరిజనుల జీవితాలు మెరుగుపడుతాయని సేవాలాల్ బోధించాడని గుర్తుచేశారు. ఆయన మార్గం మానవాళి పురోభివృద్ధికి దోదపడుతుందని అన్నారు. ఎస్టీ రిజర్వేషన్ ఫలాలు కోల్పోకుండా ఉండాలంటే ఇతర కులాల వారిని వివాహాలు చేసుకోవద్దని ఎంపీ పేర్కొన్నారు. ప్రతీ బర్త్ డే రోజు జాతి ప్రత్యేక బట్టలు ధరించాలని సూచించారు. ధర్మగురువు శ్రీశ్రీశ్రీ భోజమహరాజ్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ బోధనలను ప్రతీ ఒక్కరు పాటించాలని చెప్పారు. సేవాలాల్ సేన వ్యవస్థాపక సభ్యులు ప్రేమ్‌చంద్ నాయక్, భూక్యా ప్రవీణ్ నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ బానోతు రాంబాబు, భూక్యా నాగేశ్వరరావు, భూక్యా దళ్‌సింగ్‌నాయక్, మున్సిపల్ మాజీ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, పట్టణ, మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు డానియేల్, పులి సైదులు, ధనియాకుల రామారావు, కున్సోత్ రాము, నాగార్జున్, భూక్యా శంకర్, బానోతు శారద, మాజీ ఎంపీటీసీ రోజా, తిరుపతి, సుశీల, బానోతు రవినాయక్ పాల్గొన్నారు.

వైల్డ్‌లైఫ్ బోర్డు సమావేశంలో ఎమ్మెల్యేలు


వైల్డ్‌లైఫ్ సమావేశంలో మంత్రితో ఎమ్మెల్యేలు పాయం, రాందాస్

మణుగూరు టౌన్: హైదరాబాద్‌లోని సచివాలయంలో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన సోమవారం జరిగిన తెలంగాణ బోర్డు వైల్డ్ లైఫ్ బోర్డు సమావేశంలో బోర్డు సభ్యులైన పినపాక, వైరా ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, మాలోతు రాందాస్‌నాయక్ పాల్గొన్నారు. ఈసందర్భంగా పినపాన నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో అభివృద్ధి పనులకు అటవీ అనుమతులు ఇప్పించాలని పాయం కోరారు. కరకగూడెం మండలం భట్టుపల్లి క్రాస్ నుంచి మామకన్ను వయా ఆళ్లపల్లి బీటీ రోడ్డు, గుండాల– రంగాపూర్ వయా దామరతోగు సాయిన్నపల్లి మీదుగా రోడ్డు, అశ్వాపురం మండలం మొండికుంట–మామిళ్లవాయి రోడ్డుకు అనుమతులు ఇప్పించాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే, రేగులగండి, తుమ్మల చెరువు ప్రాంతాల్లో ఎకో టూరిజం అభివృద్ధి, అర్హులకు పోడు పట్టాలు, పట్టాలు అందుకున్న వారికి బోరు, మోటార్, కరెంట్ లైన్లకు అనుమతులపై చర్చించగా బోర్డు సమావేశంలో తీర్మానం చేయించినట్లు ఆయన వెల్లడించారు.

గుండెపోటుతో డిప్యూటీ సీఎం పీఏ మృతి

నివాళులర్పించిన భట్టి, మంత్రి తుమ్మల


శ్రీనివాసరావు (ఫైల్)

మధిర: డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వ్యక్తిగత సహాయకుడు(పీఏ) తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు(51) సోమవారం ఖమ్మంలోని ఆయన నివాసంలో గుండెపోటుతో మృతి చెందారు. ఖమ్మం ఐసీడీఎస్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ అయిన ఆయన ఆరేళ్ల క్రితం భట్టి వద్ద పీఏగా నియమితులై కొనసాగుతున్నారు. కురవి మండలం సీరోలుకు చెందిన శ్రీనివాసరావు దశాబ్ద కాలంగా ఖమ్మం కరుణగిరి సమీపాన టీఎన్జీఓస్ కాలనీలో స్థిరపడ్డారు. ఖమ్మంలోని భట్టి క్యాంప్ కార్యాలయానికి వెళ్లడానికి సోమవారం ఉదయం శ్రీనివాసరావు సిద్ధమవుతుండగా గుండెపోటుతో కుప్పకూలారు. దీంతో కుటుంబ సభ్యులు ఖమ్మంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆయనకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు.


నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, పక్కన ఎంపీ రఘురాంరెడ్డి, ఎమ్మెల్యే రాందాస్ తదితరులు

శ్రీనివాసరావు మృతదేహం వద్ద డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, మల్లు నందిని, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో పాటు కాంగ్రెస్ నాయకులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వేమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు నివాళులర్పించారు. ఈసందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ శ్రీనివాసరావు నిబద్ధత, నిస్వార్థ సేవలు మరువలేనివని తెలిపారు.

ఇసుక లారీల అడ్డగింత


లారీలను నిలిపివేసి ఆందోళన చేస్తున్న స్థానికులు

చర్ల: మండలంలోని మొగళ్లపల్లి నుంచి ఇసుక తరలిస్తున్న లారీలను సోమవారం స్థానికులు అడ్డుకున్నారు. ఇసుక లారీలతో రోడ్లపై దుమ్ములేచి ఇబ్బందులు పడుతున్నామని ఆరోపించారు. మిర్చి తోటల్లో కూడా దుమ్ము పడి పంట నష్టం జరుగుతోందని రైతులు పేర్కొంటున్నారు. దుమ్ము లేవకుండా రోడ్లపై నీళ్లు కూడా చల్లడం లేదంటూ లారీలను నిలిపివేశారు. ఇసుక రవాణాదారులు అక్కడకు చేరుకుని రోడ్లను పూర్తిస్థాయిలో తడిపి దుమ్ము లేవకుండా జాగ్రత్తలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

బూర్గంపాడు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సోమవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. తాళ్లగొమ్మూరు గ్రామశివారులో నిల్వ చేసిన ఇసుకను అనుమతులు లేకుండా ట్రాక్టర్‌లో లోడింగ్ చేసి బయటకు తరలిస్తుండగా పట్టుకుని వాహనం స్వాధీనం చేసుకున్నారు. ట్రాక్టర్ డ్రైవర్ బూరం అర్జున్, యజమాని బూడిదల అప్పారావులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేశ్ తెలిపారు.

వీకే రామవరంలో ఇసుక లారీ..


పోలీసులు సీజ్ చేసిన ఇసుక లారీ

ములకలపల్లి: అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సోమవారం పోలీసులు సీజ్ చేశారు. ఎస్సై కిన్నెర రాజశేఖర్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని వీకే. రామవరం శివారు నుంచి ఇసుక తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో తనిఖీలు చేపట్టారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న లారీని స్వాధీనం చేసుకుని, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజుతండాలో చోరీ

టేకులపల్లి: మండలంలోని రాజుతండాలో సోమవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. చింతల్లంక పంచాయతీ రాజుతండాకు చెందిన గ్రామీణ వైద్యుడు మెంతెన శేషగిరి దంపతులు ఇంటికి తాళం వేసి ఖమ్మం వెళ్లారు. సాయంత్రం భార్య శ్వేత ఇంటికి వచ్చే సరికి తాళం పగులగొట్టి లాకర్ తెరిచి ఉంది. అందులోని తులం బంగారం, రూ.70 వేల నగదు, 40 తులాల వెండి అపహరించారు. బాధితుల సమాచారంతో సీఐ సురేష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అక్రమంగా జామాయిల్ తోట నరికివేత


నరికివేసిన జామాయిల్ చెట్లు

టేకులపల్లి: జామాయిల్ తోట నరికివేత ఘటనలో ముగ్గురిపై సోమవారం కేసు నమోదైంది. బోడు ఎస్ఐ పొడిశెట్టి శ్రీకాంత్ కథనం ప్రకారం.. మండలంలోని సంపత్‌నగర్ ప్రాంతంలో ఏపీలోని తాడేపల్లిగూడేనికి చెందిన మద్దిపాటి వెంకటేశ్వర్లుకు 20 ఎకరాల జామాయిల్ తోట ఉంది. కాగా ఏలూరి కోటేశ్వర్‌రావు, చిట్టిబాబు, శంకర్ అనే ముగ్గురు వ్యక్తులు అక్రమంగా ఎకరం జామాయిల్ తోటను నరికించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

సుమారు 150 ఎకరాల్లో..

మండల పరిధిలోని మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో స్థానికంగా నివాసం ఉండని గిరిజనేతరులకు చెందిన సుమారు 150 ఎకరాల జామాయిల్ తోటలను కొందరు స్థానికులు సిండికేట్‌గా మారి కలప నరికి వేశారు. గుట్టు చప్పుడు కాకుండా అమ్మేసుకుని సొమ్ము చేసుకున్నారు. ఈ వ్యవహారంలో అధిక మొత్తంలో నగదు చేతులు మారినట్లు సమాచారం. ప్రశ్నించిన భూ యజమానులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, వారికి రాజకీయ నాయకులు, పోలీసుల అండదండలు ఉన్నాయని ఆరోపణలు వస్తున్నాయి.

గ్యాస్ లీకై చెలరేగిన మంటలు


ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో చెలరేగుతున్న మంటలు

భద్రాచలంఅర్బన్: పట్టణంలోని కూనవరం రోడ్డులో ఉన్న దుర్గాభవాని ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో సోమవారం గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. దుకాణం నిర్వాహకుల సమాచారంతో వచ్చిన అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ప్రమాదంలో రూ.40 వేల ఆస్తినష్టం జరిగినట్లు నిర్వాహకులు తెలిపారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం

అశ్వారావుపేటరూరల్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఓ పెంకుటిల్లు పూర్తిగా దగ్ధమైన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. స్థానికులు, బాధితురాలి కథనం ప్రకారం.. మండల పరిధిలోని వినాయకపురం కాలనీ గ్రామానికి చెందిన ఒంటరి మహిళ దైదా భార్గవి ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. ఇల్లు పూర్తిగా కాలిపోగా, బాధితురాలికి కట్టుబట్టలే మిగిలాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పారు. బాధితురాలు ఇంట్లోనే బట్టలు వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. దీంతో విక్రయించేందుకు ఇంట్లో ఉంచిన రూ.2 లక్షల విలువైన కొత్త బట్టలు, రూ.లక్ష నగదు, మరో రూ. 2 లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు, బీరువా, వంట సామగ్రి సర్వం కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.5 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపింది. బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు బిర్రం వెంకటేశ్వరరావు వంట గిన్నెలు, 2 క్వింటాళ్ల బియ్యం బస్తాలను అందించారు. బాధితురాలిని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కరకగూడెం: ట్రాలీ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం కరకగూడెంలో పోలీసులు పట్టుకున్నారు. బియ్యం స్వాధీనం చేసుకుని, వాహనాన్ని సీజ్ చేశామని, ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేశామని ఎస్సై రాజేందర్ తెలిపారు.

పేకాటరాయుళ్లు అరెస్ట్

దమ్మపేట : మండల పరిధిలోని అల్లిపల్లి గ్రామ శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ఎస్సై సాయి కిషోర్ రెడ్డి కథనం ప్రకారం... మండలంలోని అల్లిపల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడి చేయగా ముగ్గురు వ్యక్తులు పారిపోయారు. ఏడుగురిని అదుపులోకి తీసుకుని, రూ.5600 నగదు, మూడు బైక్లు, టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. 10 మందిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

హత్యాయత్నం కేసులో జైలుశిక్ష

భద్రాచలంఅర్బన్: హత్యాయత్నం కేసులో ముద్దాయికి ఆరు నెలల జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ భద్రాచలం ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ జ్యుడీషియల్ కోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. కేసు వివరాలిలా.. పట్టణంలోని ఎస్ఆర్ఎన్ కాలనీకి చెందిన బుయ్యని వినోద్‌పై దుమ్ముగూడెం మండలం రేగుబల్లికి చెందిన జెట్టి చరణ్ హత్యాయత్నానికి పాల్పడగా పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. న్యాయమూర్తి వి.శివనాయక్ విచారించడంతో నేరం రుజువుకాగా నిందితుడు చరణ్‌కు జైలుశిక్ష విధించారు. ఏపీపీ శ్రీనివాస్ వాదనలు వినిపించగా, కోర్టు డ్యూటీ ఆఫీసర్ నరసింహారావు సహకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుండాల: ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడిన ఘటనలో తండ్రీ కూతుళ్లకు గాయాలైన సంఘటన సోమవారం జరిగింది. ఆళ్లపల్లి మండలం చింతోనిగుంప గ్రామానికి చెందిన శ్రీను తన కూతురు హర్షితను తీసుకుని బైక్‌పై తలకలపూడి గ్రామం వెళ్తున్నాడు. మార్గమధ్యలో మొట్లగూడెం గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడ్డారు. దీంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 ద్వారా కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు.